క్లుప్తంగా

ఇన్‌చార్జ్‌ ఏఓగా సుధాకర్‌రెడ్డి



ఉయ్యాలవాడ: మండల ఇన్‌చార్జ్‌ ఏఓగా శుక్రవారం సుధాకర్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వర్తించే రాజేంద్రకుమార్‌ దీర్ఘకాల సెలువుల్లో వెళ్లడంతో ఇన్‌చార్జ్‌గా సంజామల ఏఓ సుధాకర్‌రెడ్డికి ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జ్‌ ఏఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 11 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో 20 మెట్రిక్‌ టన్నుల డీఏపీ, 10 టన్నులు యూరియా బస్తాలు నిల్వ చేస్తామన్నారు.

చెత్తను రోడ్లపై వేయొద్దు



పెద్దవంగలి గ్రామంలో ప్రకృతి సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్‌ షరీఫ్‌

చాగలమర్రి: ప్రజలు ఇళ్లలోని చెత్త చెదారాన్ని రోడ్లపై వేయొద్దని పెద్దవంగలి గ్రామ సర్పంచ్‌ షరీఫ్‌ సూచించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని ప్రకృతి సంపద కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్‌ డస్ట్‌బిన్‌లను పంపిణీ చేస్తామని, వాటిలో తడి, పోడి చెత్తను వేర్వేరుగా ఉంచితే పారిశుద్ధ్య కార్మికులు తీసుకెళ్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్‌, మాజీ సర్పంచ్‌ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



స్నేహితునికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07బ్యాచ్‌ పదవ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం స్నేహితుడైన మబ్బు బాలనరసింహ్ముడికి రూ.33వేలు అందజేశారు. మబ్బు బాలనరసింహ్ముడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్నేహితులు తమ వంతుగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు అనిల్‌ గపూర్‌, ప్రతాప్‌, మస్తాన్‌, హుస్సేన్‌, బాలచౌడయ్య, బాలవెంకటయ్య, పాములేటి, నరసింహ్మ, నాగరాజు, జగన్‌, వెంకటరమణ, కాశీం పాల్గొన్నారు.

దసరా ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



రుద్రవరంలో దసరా ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం దసరా ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చోళవేటి స్యూనారాయణ మాట్లాడుతూ అక్టోబర్‌ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ముందుగా ఉత్సవాలు, సేవలు, పూజా కైంకర్యాలు తదితర అంశాలతో పత్రికను ముద్రించి అమ్మవారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి పెరుమాళ్ల నరసింహ్మయ్య, సెక్రెటరీ వెంకట సుబ్రహ్మణ్యం, సభ్యులు సుబ్బనర్సయ్య, సత్యానారాయణ, వెంకటేశ్వర్లు, రమణ, శ్రీనివాసులు, మోహన్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామకృష్ణ

ఆళ్లగడ్డ: పంటల సాగులో రైతులు తప్పని సరిగా యాజమాన్య పద్ధతులు పాటించేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్‌ శాస్త్రవేత్తలు రామకృష్ణ, వెంకటరమణమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలకు మొక్కజొన్న, వరి, మినుము, పత్తి పంటలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఈసందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌ రెడ్డి, ఏఓలు పాల్గొన్నారు.

నేడు గ్రామ సచివాలయాల్లో సదస్సులు

ఉయ్యాలవాడ : మండలంలోని 11 గ్రామసచివాలయాల్లో శనివారం 'మన ఇల్లు – మన గౌరవం' అంశంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు హౌసింగ్‌ ఏఈ నరసింహరావు తెలిపారు. గత ప్రభుత్వంలో గృహాలు మంజూరై నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునే చైతన్య పరుస్తామన్నారు. గ్రామ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో సదస్సులు జరుగుతాయని చెప్పారు.



ఈ పత్తిపొలంలో కనిపిస్తున్న రైతు రమేష్‌. దొర్నిపాడులో ఐదెకరాల్లో విత్తన పత్తిని సాగుచేశాడు. అయితే క్రాసింగ్‌ పనులు మొదలు పెట్టాక మగపూల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో ఆయన రోజూ వేరేప్రాంతాల నుంచి మగపూలను బదులుగా తెచ్చుకుని ఇబ్బందులను తీర్చుకుంటున్నాడు. చాలా ఏళ్లనుంచి విత్తన పత్తిని సాగుచేస్తున్నానని, ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదంటున్నాడు రైతు రమేష్‌. అధిక వర్షాల కారణంగానే మగపూల ఉత్పత్తి తగ్గిపోయిందని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

- అధిక వర్షాల ప్రభావం
- సమయానికి మగపూలు రాక ఇబ్బందులు
- ఆదిలోనే విత్తనపత్తి రైతులకు ఎదురు దెబ్బ
- అయోమయంలో అన్నదాతలు

సీడ్‌ పత్తికి 'కొత్త' సమస్య!



క్రాసింగ్‌ పనుల్లో పాల్గొన్న కూలీలు



మగలపూలు లేనందను తెంచి పడేసిన ఆడపూలు

దొర్నిపాడు: పత్తి సాగుకు మూలమైన సీడ్‌ పత్తికి (విత్తన పత్తి) కొత్త సమస్య ఎదురైంది. దొర్నిపాడు మండలంలో సీడ్‌పత్తిని విస్తారంగా సాగు చేస్తారు. ఈ పత్తి రైతుకు ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆదిలోనే కొత్త సమస్య చూస్తున్నాడు. మండలంలో 1,022 హెక్టార్లలలో విత్తన పత్తి సాగు అయ్యింది. అయితే సగానికి సగం సాగు ఆలస్యమైంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలు చెట్ల ఎదుగుదలకు ఉపయోగపడినా పూల ఉత్పత్తికి అడ్డంకిగా మారింది. దీంతో వారం రోజుల నుంచి మగపూలు రాకపోవడంతో ఆడపూలను తెంచివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మండలంలో విత్తన పత్తి క్రాసింగ్‌ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగుచేసిన మగచెట్లకు పూలు సరిగ్గా రావడం లేదు. కూలీలకు కూలి వస్తుందే కాని రైతన్నకు మాత్రం నిరాశే మిగులుతుంది. విత్తన పత్తిని నాటే ముందు ఆడ పత్తిచెట్లతో పాటు మగ పత్తి చెట్లనే అదే పొలంలో ఒకవైపు విత్తుతారు. సీడ్‌ క్రాసింగ్‌ కావాలంటే తప్పనిసరిగా మగపూల చెట్లు అవసరం. ఇవీ ఆడ, మగ చెట్లు ఒకేసారి మొగ్గలు తొడియాల్సి ఉంది. ఆడ పత్తి చెట్ల మొక్కలను ఒలిచి వాటి నామానికి మగపూలు యొక్క పుప్పొడిని అద్దుతారు. దీంతో అది విత్తనపత్తి కాయగా మారుతుతుంది. లేదంటే ఎలాంటి ఉపయోగం లేకుండా నేల రాలుతుంది. ప్రస్తుతం ఆడపూలు వస్తున్నాయతప్పా మగపూలు సరిగ్గా రావడంల లేదు. దీంతో రైతులు ఆందోళ న చెందుతున్నారు. కొంత మంది రైతులు ముందుగా సాగుచేసిన రైతుల నుంచి మగపూలును తెచ్చుకుంటుండగా మరికొందరు దూరప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. చాలా మంది రైతులకు మగ పూలు దొరక పోవడంతో ఆడ పూలను తెంచి రోడ్లపాలు చేస్తున్నారు. ఒక్క మగపూల పుప్పొడి 10నుంచి 15 ఆడ పూల నామాలకు అద్దుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

వర్షమే కారణమా...?

అధిక వర్షాలకు పొలంలో తేమశాతం అధిక వర్షాలతో పూలు రాలేదా లేకా విత్తనాలలో ఏదైనా సమస్యా ఉందా అనే సందిగ్ధం రైతుల్లో నెలకొంది. ఈ ప్రభావం పూలపై పడిందని రైతులతోపాటు వ్యవసాయాధికారులు సైతం భావిస్తున్నారు. అంతేగాక ఆడచెట్లకు రెండు వారాలకు ఒకసారి రసాయన మందు పిచికారీ చేస్తే మగ చెట్లకు మాత్రం ఆరు రౌండ్లు మందులనే స్ప్రేచేయాల్సి ఉంది. దీంతో రైతులు ఆ చెట్ల పూలను తెంపి పడేస్తున్నారు. పొలంలో తేమశాతం ఆరేదాక పూలు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దీంతో రోజు రూ.400 నుంచి 500 చొప్పు కూలీలకు కూలి చెల్లించి తెంపిస్తున్నారు. అలాగే పత్తిలో చారా రకాల విత్తనాలు ఉండటంతో లోకల్‌గా పూలు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

విత్తన పత్తిలో చాలా రకాలు ఉన్నాయి



సాధరణంగా అధిక వర్షాలు విరామం లేకుండా కురిసినా ఆడ, మగ మొగ్గలు నేల రాలే అవకాశం ఉంది. కానీ ఇక్కడ మగపూలే సరిగ్గా రావడం లేదంటున్నారు. కాబట్టి విత్తన కంపెనీలను రైతులు సంప్రదిస్తే బాగుంటుంది. ఎందుకంటే విత్తన పత్తిసాగులో ప్రస్తుతం చాలా రకాలు వచ్చాయి. కమర్షియల్‌ పత్తి అయితే మా పరిధిలో సలహాలు సూచనలు ఇవ్వగలం. ఈ విషయాన్ని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకుని వెళ్లాల్సిందే.

–సునీత, ఏఓ, దొర్నిపాడు

నేర నియంత్రణ జిల్లాగా నంద్యాల

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎస్పీ అదిరాజ్‌ సింగ్‌ రాణా పోలీస్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆత్మకూరు సబ్‌ డివిజన్‌ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌, మిస్సింగ్‌ కేసులు, బాలికలపై జరిగిన నేరాలపై ఆరా తీశారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి చోరీలు జరగకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌, ఆదినారాయణ, ప్రియతంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు

నంద్యాల(అర్బన్‌): స్థలం, భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలేఉ తీసుకుంటామని నంద్యాల సబ్‌ రిజిస్ట్రార్‌ అబ్దుల్‌సత్తార్‌ తెలిపారు. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దని, పరిమితి మేరకే స్టాంప్‌ రైటర్లను లోపలకు అనుమతిస్తామన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో ప్రమోషన్లు లేక పరిస్థితులను బట్టి 70 మంది గ్రేడ్‌–2 రిజిస్టార్లు గ్రేడ్‌–1లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారమే తాను గ్రేడ్‌–1 రిజిస్ట్రార్‌గా విధుల్లోకి వచ్చానని, తన నియామకంలో ఎవరి రెకమెండేషన్‌ లేదన్నారు. తనపై ఎలాంటి కేసులు, ఆరోపణలు లేవని, స్టాంప్‌ రైటర్లతో ఎలాంటి సంబంధాలు లేవన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



చిలుకలూరులో ఆంజనేయ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని చిలుకలూరులో సర్పంచ్‌ ప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పార్థసారథి రెడ్డి తదితరులు శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. అనంతరం పూజలు నిర్వహించి సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి అంటూ మొక్కుకున్నారు. మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టామన్నారు. తిరుపతి లడ్డు విషయంపై ప్రభుత్వ కుట్రలను ఖండిస్తూ జగనన్నకు మద్దతుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు.

మందుబాబుకు జైలు శిక్ష

బండిఆత్మకూరు: మండల పరిధిలోని బి.కోడూరు గ్రామానికి చెందిన ఈశ్వర్‌కు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు శుక్రవారం ఎస్‌ఐ జగన్మోహన్‌ తెలిపారు. గ్రామానికి చెందిన ఈశ్వర్‌ మద్యం తాగి గొడ్డలి చేత బట్టి రోడ్డున పోయే వారిని భయాందోళనకు గురి చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతన్ని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 5 రోజులు జైల్‌ శిక్ష విధించినట్లు తెలిపారు.

ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించండి



మాట్లాడుతున్న నిరంజన్‌ రెడ్డి

నంద్యాల(రూరల్‌): పారిశుద్ధ్య కార్మికులకు రుణాలు, ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించాలని మున్సిపల్‌ కమిషనర్‌ నిరంజన్‌ రెడ్డి బ్యాంకర్స్‌కు సూచించారు. శుక్రవారం మున్సిపల్‌ సమావేశ భవనంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆయన బ్యాంకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు శ్రమించే పారిశుద్ధ్య కార్మికులకు బ్యాంకర్స్‌ అండగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌ఓ అంకిరెడ్డి, శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

వినియోగంలోకి గ్రామ సచివాలయం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ని ర్మించిన కొత్త గ్రామ సచివాలయం–3లో ఉద్యోగులు శుక్రవారం చేరారు. వర్షాలకు పాత భవనం పైకప్పు పెచ్చులాడి పడుతుండటంతో ఉద్యోగులు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియ జేయడంతో అంగీకరించారు. ఈ మేరకు కొత్త భవనంలోకి ఉద్యోగులు చేరి ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సుధాకర్‌ప్రసాద్‌ సేవలు మరువలేనివి

నంద్యాల(అర్బన్‌): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ఏపీ ఎన్‌జీఓస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీగా అసోసియేషన్‌ అభివృద్ధికి సుధాకర్‌ప్రసాద్‌ చేసిన సేవలు మరువలేనివని తహసీల్దార్‌ ప్రియదర్శిని కొనియాడారు. సుధాకర్‌ ప్రసాద్‌ వర్ధంతిని పురస్కరించుకొని తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణంలో పార్కులో ఏర్పాటు అయిన విగ్రహానికి రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ ప్రియదర్శిని మాట్లాడుతూ అసోసియేషన్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సుధాకర్‌ప్రసాద్‌ ఎనలేని కృషి చేశారన్నారు. నిత్యం ఉద్యోగుల పక్షాన నిలబడి శ్రమించిన ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీటీలు రామచంద్రారావు, శేఖర్‌, రామసంజీవరావు, నాగరాజు, ఆర్‌ఐ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన నాగరాజు

గోస్పాడు: జిల్లా పంచాయతీ రాజ్‌ శాఖ ఇంజినీరింగ్‌ అధికారిగా నాగరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న జిల్లా ఇంజినీరింగ్‌ అధికారి రామ్మోహన్‌ను ఉన్నతాధికారులు తిరుపతికి బదిలీ చేశారు. దీంతో బద్వేల్‌లో పనిచేస్తున్న నాగరాజును ఉన్నతాధికారులు ఇక్కడ విధుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో కూడా నంద్యాలలో ఐదేళ్లపాటు డీఈగా పని చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళలపై జరిగే నేరాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్‌): మహిళలపై జరుగుతున్న నేరాలపై, సైబర్‌ క్రైమ్‌పై పోలీసు అధికారులు శుక్రవారం ఎన్‌జీఓ కాలనీలోని బ్యాంకింగ్‌ కోచింగ్‌ వద్ద విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్‌ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా ప్రమాదంలో ఉన్నప్పుడు 112కు కాల్‌ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

నేడు మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం

నంద్యాల(రూరల్‌): స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం మున్సిపల్‌ కౌన్సిల్‌ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్‌ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చైర్‌పర్సన్‌ మాబున్నీసా అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మున్సిపల్‌ కౌన్సిల్‌ కోఆప్షన్‌ మెంబర్‌లు, కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బాలల హక్కుల పుస్తకాన్ని విడుదల చేస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్‌): ప్రత్యేక రక్షణ చట్టాలు, పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ బ్రహ్మంనాయక్‌, ఉర్దూ డీఐ అస్మాద్దీన్‌, దిశ పోలీసు స్టేషన్‌ సీఐ సురేష్‌ దివ్యాంగులకు సూచించారు. శుక్రవారం నందమూరినగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగులకు 21 చట్టాలు ఉన్నాయన్నారు. లాంప్‌ యాజమాన్యం అందిస్తున్న విద్యా, ఆరోగ్యం గురించి వివరించారు.

నామినేటెడ్‌ పోస్టులు భర్తీ చేయాలి

ఉర్దూ అకాడమీని పటిష్ట పరిచేందుకు నామినేటెడ్‌ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్‌ ఉర్దూ టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కన్వీనర్‌ అబ్దుల్‌అజీజ్‌ శుక్రవారం మంత్రి ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

30న తైక్వాండో ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్‌): స్థానిక పద్మావతినగర్‌లోని ఇండోర్‌ స్టేడియంలో ఈనెల 30న తైక్వాండో అండర్‌–14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్‌ సెక్రటరీ గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారుల వివరాలను ఎండీఎం ఫాంలో పొందు పరచాలన్నారు. తైక్వాండో కిట్టు క్రీడాకారులే తెచ్చుకోవాలన్నారు.

ట్రాక్టర్‌ బోల్తా...విద్యార్థి మృతి



బుక్కె శ్రీనివాస్‌ నాయక్‌ (ఫైల్‌)

చాగలమర్రి: ట్రాక్టర్‌ రూపంలో విద్యార్థిని మృత్యువు కబళించి తల్లి దండ్రులకు శోకం మిగిలించింది. ముత్యాలపాడు గ్రామ చెరువు సమీపంలోని గంగమ్మ గుడి వద్ద శుక్రవారం రాత్రి ప్రమాద వశాత్తు ట్రాక్టర్‌ బాల్తా పడిన సంఘటనలో ఓజీ తండాకు చెందిన విద్యార్థి బుక్క శ్రీనివాస్‌ నాయక్‌(18) అక్కడికక్కడే మృతి చెందగా, అతని చిన్న అవ్వ ధనికాబాయికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డి.వనిపెంట పంచాయితీ మజరా గ్రామం అయిన ఓజీ తండాకు చెందిన బుక్కె వస్తం నాయక్‌, లాలీబాయి దంపతులకు ముగ్గురు మగ సంతానం. మూడవ కుమారుడు బుక్కె శ్రీనివాస్‌ నాయక్‌ నంద్యాల పట్టణంలోని బోమ్మల సత్రం వద్ద ఉన్న ప్రభుత్వ ఎస్‌టీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం స్వగ్రామమైన ఓజీ తండాకు వచ్చాడు. తల్లిదండ్రులు తమ సొంత పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను నూర్పిడి చేశారు. ధాన్యాన్ని ఆరబోసేందుకు రాత్రి ఓజీ తండా నుంచి ముత్యాలపాడు గ్రామానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ముత్యాలపాడు చెరువు సమీపంలో గంగమ్మ గుడి వద్ద రోడ్డుపై గుంతలుపడి ఉండడంతో ట్రాక్టర్‌ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌పై నుంచి క్రిందకు దూకిన బుక్కె శ్రీనివాస్‌ నాయక్‌పై ట్రాలీ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నవ్వ ధనికాబాయి సమీపంలోని వరి మడిలో పడింది. ఆమెను చికిత్స నిమిత్తం స్థానికులు 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తామని స్థానిక ఎఎస్‌ఐ షేక్‌ అబ్దుల్‌ నబీ తెలిపారు.

ఈఓపీఆర్డీ బదిలీ

దొర్నిపాడు: స్థానిక ఈఓపీఆర్డీ శ్రీనివాసులును అవుకు మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఇన్‌చార్జ్‌ ఎంపీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి ఈఓపీఆర్డీగా పత్తికొండ నుంచి సులోచన రానున్నారు.

ఘనంగా సత్యసోదక్‌ సమాజ్‌ ఆవిర్భావ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్‌): మహాత్మా జ్యోతిబా పూలే స్థాపించిన సత్యసోదక్‌ సమాజ్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు అజీజ్‌బాషా, మాబాషా, ఖాజా, రామాంజనేయులు, ఎల్లప్ప, ప్రదీప్‌, నవీన్‌, రఫీ, బాలాజీ పాల్గొన్నారు.

కంది రైతులను ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్‌): పిన్నాపురం సోలార్‌ కంపెనీ యాజమాన్యం దున్నేసిన కంది పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌, రైతు సంఘం సీనియర్‌ నాయకులు సుబ్బరాయుడు శుక్రవారం ఆర్‌డీఓ మల్లికార్జునకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామ సభలు నిర్వహించి నష్ట పరిహారం ఇవ్వాలని అధికారులకు, ఎమ్మెల్యేలకు విన్నవించినా ఫలితం లేదని, రైతుల పంటలను నాశనం చేసిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్‌ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజకుమారి

నంద్యాల(అర్బన్‌): జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231 టాయిలెట్లు, 425 తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.55 కోట్ల మంజూరు చేసిందని, నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సెందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ రాజకుమారి ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో టాయిలెట్‌ నిర్మాణానికి రూ.36 వేల చొప్పున 231 టాయిలెట్లకు రూ.83.16 లక్షలు, మంచినీటి సదుపాయం కోసం రూ.17వేల చొప్పున 425 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.72.25 లక్షలు మొత్తం 656 పనులకు గానూ కేంద్ర ప్రభుత్వం రూ.1.55 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. తాగునీటి సదుపాయం, టాయిలెట్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి అక్టోబర్‌ 15 తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ మనోహర్‌, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారాన్ని తీసుకోండి

నంద్యాల(న్యూటౌన్‌): ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్‌ రాజకుమారి సూచించారు. శుక్రవారం సెయింట్‌ జోసెఫ్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ పోషణ్‌ మాసోత్సవాలలో కలెక్టర్‌ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పోషకాహార లోపాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోషకాహార స్టాళ్లను సందర్శించి వివిధ రకాలైన చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి, సీడీపీఓలు పాల్గొన్నారు.

ఎరువుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్‌

నంద్యాల(అర్బన్‌): జిల్లాకు వచ్చిన స్పిక్‌, కోరమాండల్‌ కంపెనీల ఎరువుల వ్యాగిన్‌ను జేసీ విష్ణుచరణ్‌ శుక్రవారం తనిఖీ చేశారు. వచ్చిన ఎరువులను ఎవరెవరికి సరఫరా చేస్తున్నారంటూ డీఏఓ మురళీకృష్ణ, రేక్‌ ఆఫీసర్‌ ప్రసాదరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏఓ మురళీకృష్ణ ఎరువుల కంపెనీ సేల్స్‌ ఆఫీసర్‌ ముందస్తు ఎరువుల ప్రణాళిక ప్రకారం స్పిక్‌ యూరియా 422.5 మెట్రిక్‌ టన్నులు, డీఏపీ 441.5 మెట్రిక్‌ టన్నులు, 20:20:0:13 రకం 446.6 మెట్రిక్‌ టన్నులు, 28:28:00 రకం 480 మెట్రిక్‌ టన్నులు, సీఐఎల్‌ 20:20:0:13 రకం 1143 మెట్రిక్‌ టన్నులు కేటాయించారని, అందులో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మరో 50 శాతం ప్రైవేట్‌ డీలర్లకు కేటాయించామన్నారు. కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని డీఏఓ తెలిపారు.

'గురురాజ' విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్‌): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్‌ పోటీల్లో గురురాజ ఇంగ్లీష్‌ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను జేసీ విష్ణుచరణ్‌, పర్యాటక అధికారులు అభినందించారు. జిల్లా స్థాయి క్విజ్‌ పోటీలో సాత్విక, అమూల్య, పల్లవి, డ్రాయింగ్‌ పోటీల్లో మదన్‌మోహన్‌, షార్ట్‌ ఫిలిం కాంపిటీషన్‌లో సరయ్‌రెడ్డి, వక్తృత్వంలో సాయివర్షిణి బహుమతులు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్‌ టూరిజం ఆఫీసర్‌ సత్యనారాయణ, టూరిజం మేనేజర్‌ లక్ష్మీనారాయణ, పాఠశాల డైరెక్టర్‌ షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు.

బాలచంద్ర సమతా విద్యానికేతన్‌..

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన బాలచంద్ర సమతా విద్యానికేతన్‌ విద్యార్థులకు శుక్రవారం జేసీ చేతుల మీదుగా బహుమతులను అందజేసినట్లు కరస్పాండెంట్‌ బాలచంద్రుడు తెలిపారు.

హోటల్‌ అసోసియేషన్‌ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్‌

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్‌ హోటల్‌ అసోసియేషన్‌ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మైనార్టీ శాఖ, న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ తెలిపారు. శుక్రవారం ఎల్‌కేఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్‌ హోటల్‌ అసోసియేషన్‌ సమావేశంలో మంత్రి ఫరూక్‌ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులకు హోటల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 5 లక్షల మందికి పైగా ఆహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. రాత్రి 12 గంటల వరకు హోటల్‌ నిర్వహించుకోవడానికి జీవో ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల 10 గంటలకు మూసివేయడంతో వ్యాపారులు నష్టపోతున్నారని, ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, రఘువీర్‌ శెనై పాల్గొన్నారు.